క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో కృష్ణయ్య

దొరవారిసత్రం : నెమిలమిట్ట అగ్రహారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో కృష్ణయ్య తనిఖీ చేశారు. జగనన్న గోరు ముద్ద కార్యక్రమాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం పరంధామయ్య పాల్గొన్నారు.

తీర గ్రామంలో వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దొరవారిసత్రం : తీర గ్రామమైన మీజూరు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గురువారం వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. చుట్టు పక్కల తీర గ్రామాల నుంచి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి తరుణ్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మసీదులు, ఈద్గాల అభివృద్ధికి చర్యలు



శ్యాంసుందరపురంలో ముతవల్లీల సమావేశం

కోట: గూడూరు నియోజకవర్గంలోని మసీదు లు, ఈద్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామ ని జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ అలీభాయ్ తెలిపా రు. శ్యాంసుందరపురంలోని మసీదులో గురువా రం ముతవల్లీల కమిటీ అధ్యక్షుడు మొబీన్‌బాష ఆధ్వర్యంలో ముతవల్లీల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు రహీం, సంయుక్త కార్యదర్శి జిలానీ, రియాజ్, హిదయతుల్లా, అమీరుద్దీన్, ఇలియాజ్ పాల్గొన్నారు.

రహదారి భద్రత- జీవితానికి రక్ష



మాట్లాడుతున్న ఎంవీఐ సునీల్

గూడూరు రూరల్ : రహదారి భద్రత జీవితానికి రక్ష అని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సునీల్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం శారదానగర్‌లో ఉన్న లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలను చైతన్యం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. వాహనచోదకు లు రహదారి నియమాలు పాటించాలని కోరా రు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డ్రైవర్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

తహసీల్దార్ సాంబశివరావు బాధ్యతల స్వీకరణ

వెంకటగిరి రూరల్ : తహసీల్దార్ కె సాంబశివరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు వెస్ట్ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

పోలీసులకు సహకరించండి

సైదాపురం: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ జీఎస్ విజయ్‌కుమార్ కోరారు. ఆయన గురువారం ఓరుపల్లి, చాగణం గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎవరూ వివాదాల జోలికి పోవద్దన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాంకేతిక సాగుతో అధిక దిగుబడులు

ఏర్పేడు: ఆధునిక సాంకేతిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన్ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని పాపా నాయుడుపేట రాస్ కార్యాలయంలో రైతు రుణ మేళా జరిగింది. ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులతో భూసారాన్ని పెంచవచ్చని తెలిపారు. డ్రమ్ సీడర్ విధానంతో కూలీల ఖర్చు తగ్గుతుందని వివరించారు. రాస్ ద్వారా 123 మంది రైతులకు 68.4 లక్షల రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, ఫీల్డ్ అధికారి వెంకట్ కుమార్, ఎంఐఎస్ మునిపార్థసారథి, మునీంద్ర, తిరుపాల్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

చిల్లకూరు : ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో గ్రామాల్లో ఉండే బీఎల్‌వోలు కీలకంగా వ్యవహరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులను గుర్తించాలన్నారు. రెండుసార్లు ఓట్లు నమోదు అయిన వాటిని గుర్తించి తొలగించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపుల పరిస్థితిని గమనించి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలు, సచివాలయాల వద్ద ఓటరు జాబితాలను ఏర్పాటు చేయాలని, అభ్యంతరాలను తీసుకుని అధికారుల దృష్టికి తీసుకురావాలనానరు. ఏఎస్‌వో బాష తదితరులు పాల్గొన్నారు.



చిల్లకూరు: బీఎల్‌వోలతో సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలి

దక్కిలి: బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఓటరు జాబితా అనుబంధ అంశాలపై బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఓటరు పేరు, ఫొటో ఉండేలా చూడాలన్నారు. తప్పులు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా ర్యాంపులు సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ ఉంటుందని, అందుకు అనుగుణంగా పూర్తి స్థాయి విద్యుత్ సదుపాయం అవసరమని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు హరికృష్ణ, ప్రసన్న, ఆర్‌ఐ రాజేష్, మండల సర్వేయర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సైదాపురం: తహసీల్దార్ టి ప్రవీణ్‌కుమార్ గురువారం రామసాగరం, సైదాపురం, చాగణం, మర్లపూడి, కొమ్మిపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్‌ఐ నారాయణ పాల్గొన్నారు.

రాపూరులో 52 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

రాపూరు: మండలంలో 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. ఆయన గురువారం రాపూరు, సిద్దవరం పంచాయతీలు, రావిగుంటపల్లి తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌ఐ సతీష్, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



సైదాపురం : పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్



రాపూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెంకటస్వామి

కుష్టువ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

వాకాడు : కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే నయం అవుతుందని తిరుపతి జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో అరుణ సులోచన తెలిపారు. ఆమె గురువారం చినతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం చిట్టమూరు, మల్లాం, నిడిగుర్తి, చినతోట గ్రామాల ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. వైద్య సేవలపై ప్రజలను ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యులు దీప్తి, రామకృష్ణ, శ్రీనివాసులు, మదన్ మోహన్, డీపీఎంవో రాజేంద్రప్రసాద్, ప్రజాప్రతినిధులు వెంకటరత్నం, చిన్నబ్బాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో అరుణ సులోచన

కండలేరులో 11.452 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 11.452 టీఎంసీల నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 260 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పంటల సాగులో యంత్రాల వినియోగంపై అవగాహన

సూళ్లూరుపేట రూరల్ : పంటల సాగులో యంత్రాలను వినియోగిడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తిరుపతి ఆర్‌ఏఆర్‌ఎస్ వ్యవసాయ శాస్త్రవేత్త కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని వెలగల పొన్నూరులో గురువారం డ్రమ్ సీడర్ ద్వారా రైతు సి.సుధాకర్‌రెడ్డి సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. రైతు సాగు చేసే విధానంపై ఆరా తీశారు. పైరు బాగా ఎదిగి అధిక దిగుబడి వచ్చే విధానాన్ని గుర్తించారు. ఆయన మాట్లాడుతూ డ్రమ్ సీడర్ ద్వారా ఎకరాకు 12 నుంచి 16 కిలోల విత్తనాలను 40 నిమిషాల్లో విత్తవచ్చన్నారు. పాడి దుక్కిలో మాత్రమే సాగు చేయాలని సూచించారు. వరస క్రమంలో పైరు 10 సెంటీమీటర్ల దూరం ఉండడం వల్ల గాలి బాగా సోకి అధిక దిగుబడి వస్తుందని వివరించారు. శాస్త్రవేత్తలు బాలహుస్సేన్‌రెడ్డి, రమణ, ఏడీఏ అనిత, ఏవో కవిత తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నాడు-నేడు స్టోర్ రూమ్‌లో అగ్ని ప్రమాదం

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని నాడు - నేడు స్టోర్ రూమ్‌లో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.2 లక్షల విలువైన ఎలక్ట్రికల్ సామగ్రి దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్టు అధికారులు భావిస్తున్నారు. నాడు-నేడు పనులకు సంబంధించిన సామగ్రిని పాఠశాలలోని గదిలో భద్రపరిచారు. ఈ క్రమంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఎలక్ట్రికల్ సామగ్రి కాలి పోయాయి. సరైన సమయంలో మంటలను అదుపు చేయడంతో రూ.10 పది లక్షలు విలువైన తలుపులు, ఇతర వస్తువులను కాపాడగలిగారు. హెచ్‌ఎం అబ్బాస్ అలీ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ అయ్యప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

చిల్లకూరు : బాల్య వివాహాలను నియంత్రించాలని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ ఆదేశించారు. ఆమె గురువారం స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షకులతో సమావేశమయ్యారు. బాల్య వివాహాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల లేకుండా పోతుందన్నారు. దీనివల్ల భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వారికి పుట్టే బిడ్డలు కూడా సరైన బరువు, ఎత్తు లేకుండా పోవడం, అనారోగ్యంతో బాధపడతారని పేర్కొన్నారు. బాల్య వివాహాలను నియంత్రించడంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షకులు శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివజ్యోతి, నాగిశెట్టి రేణుక పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

దక్కిలి: బాల్య వివాహాలు చట్ట రీత్యానేరమని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం తెలిపారు. ఆమె గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ వర్కర్స్, సచివాలయం మహిళా పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ బాలల లైంగిక నేరాల నిషేధిత చట్టం 2012, లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మేనరికం పెళ్లిళ్ల వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పలత, పరిమళ, హెల్త్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.



దక్కిలి: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం

నెలాఖరులోగా రెన్యువల్ చేసుకోవాలి

గూడూరు రూరల్ : ఈ నెలాఖరులోగా దుకాణాలు, సంస్థలకు ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం -1998 కింద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని గూడూరు సహాయ కార్మిక కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోని దుకాణాలు, సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించాలి



కేసీఎన్‌గుంట సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సూళ్లూరుపేట రూరల్ : సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో చంద్రమౌళి ఆదేశించారు. ఆయన గురువారం సచివాలయాలు, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేసీఎన్‌గుంటలోని సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. కార్యదర్శి సు. దీర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



పల్లెవానిదిబ్బలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం

చిల్లకూరు : తీర ప్రాంతంలోని పల్లెవానిదిబ్బ గ్రామంలోని రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా హిందూ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తీర ప్రాంతంలోని ఐదు గ్రామ పంచాయతీల్లోని కాలనీల్లో కల్యాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆరవ రోజున పల్లెవానిదిబ్బ గ్రామంలో వేద పండితులు సీతారాముల కల్యాణం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ నాసిన సుబ్రమణ్యం దంపతులు, గ్రామస్తులు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం.. వైభోగం



వీరరాఘవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న రిత్వికులు

నారాయణవనం: స్థానిక కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి కల్యాణం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. వీరరాఘవ్వ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కణకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవ స్వామికి శాస్త్రోక్తంగా రిత్వికులు కల్యాణాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో పట్టుశాలి దంపతులు, మహిళలు పాల్గొని తరించారు. శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై వీర రాఘవ స్వామి ఊరేగింపు ఉంటుందని ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది.

సినిమా థియేటర్ వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల కోలాహలం



థియేటర్ వద్ద కేక్ కట్ సంబరాలు చేస్తుకుంటున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

నాయుడుపేట టౌన్ : దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానంతో రూపొందించిన యాత్ర -2 సినిమా గురువారం విడులైంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని సీఎస్ తేజ థియేటర్ వద్ద యాత్ర-2 సినిమా పేరుతో పాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేరుతో ఉన్న భారీ కేక్‌ను పార్టీ యువత కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు మాట్లాడుతూ యాత్ర సినిమాలో హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్సార్ మృతిచెందిన తర్వాత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎదుర్కొన్న రాజకీయ ఒడిదుడుకులను చూసి ప్రతి ఒక్కరూ భావోద్వేగానికిలోనై కంటతడి పెట్టుకున్నారని తెలిపారు. బీ మల్లికార్జునరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కే చెంచయ్య మొదలియార్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, ఏ చంద్రారెడ్డి, పి.నాగార్జున, ముత్యాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఎస్ మోహన్, యశ్వంత్ కుమార్, సాయి, సురేష్ పాల్గొన్నారు.

యాత్ర-2 సినిమా విజయవంతంపై వైఎస్సార్‌సీపీ నేతల సంబరాలు

వెంకటగిరి రూరల్ : దివంగత నేత వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ఆధారంగా రూపొందించిన యాత్ర-2 సినిమా విజయం కావడంపై గురువారం వైఎస్సార్ సీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. గూడూరు పట్టణంలోని జ్యోతిమహల్‌లో ప్రదర్శించిన యాత్ర-2 సినిమాను గురువారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల ప్రజలు, కార్యకర్తలు అభిమాను లు సినిమాను తిలకించి సంబరాలు జరుపుకున్నారు.



జ్యోతిమహల్ థియేటర్ వద్ద సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు

విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం

చిల్లకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వారికి అల్పాహారం అందించడం ద్వారా కొంత ఊరట లభిస్తుందని డిప్యూటీ డీఈవో శివప్రకాష్ తెలిపారు. మండలంలోని చేడిమాల గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ద్వారా గత ఏడు సంవత్సరాలుగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో 40 రోజులు సాయంత్రం పూట గోరుముద్ద పేరిట అందిస్తున్నారు. ఈ ఏడాది ఈ కార్యక్రమాన్ని గురువారం పారిచెర్లవారిపాళెంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో గత ఏడేళ్లుగా మండలంలోని 9 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు 40 రోజులు అల్పాహారం అందజేయ డం అభినందనీయమన్నారు. ట్రస్టు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు మాట్లాడుతూ పదో తరగతిలో జిల్లా స్థాయి ర్యాంకు సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు రూ.లక్ష బహుమతి ఇస్తామని ప్రకటించామని, ఈ ఏడాది కూడా అందిస్తామన్నారు. అనంతరం మండలంలోని 9 ఉన్నత పాఠశాలల్లో చదివే 355 మంది విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి సంబందించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు నగదును అందించారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్, చిల్లకూరు ఎంఈవోలు హమీద్, రవూఫ్, ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వరదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ట్రస్టు ప్రతినిధులు పిచ్చయ్యనాయుడు, రామానాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు శ్రీనివాసులు

సుబ్రమణ్యస్వామి సేవలో శ్రీశైలం ఆలయ పాలక మండలి సభ్యులు

చిట్టమూరు(చిల్లకూరు) : మండలంలోని మల్లాంలో వెలసిన వల్లీదేవ సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ పాలక మండలి సభ్యులు సందర్శించారు. వారికి అర్చకులు భానుప్రకాష్‌శర్మ ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం వారు ఆలయంలోని అన్న ప్రసాద వితరణ భవనాన్ని పరిశీలించారు. అక్కడి వసతులను చూసి సంతోషం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన దువ్వూరు శేషురెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ భవనం నిర్మించి ఇవ్వడంపై అభినందించారు. వారికి ఆలయ చైర్మన్ చిల్లకూరు సాయి రెడ్డి స్వామి వారి చిత్ర పటాన్ని అందజేసి సత్కరించారు. పార్థసారథిరెడ్డి, బెంగళూరు శర్మ, భాస్కర రెడ్డి, నారాయణరెడ్డి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం ఆలయ పాలక మండలి సభ్యులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్

నేడు ఆలయంలో తై అమావాస్య పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం తై అమావాస్యను పూజలను వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆలయం నుంచి శ్రీస్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భరద్వాజ తీర్థంలోని శివాలయానికి తీసుకెళ్లి విశేష పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నైవేద్యం, మంత్రపుష్పం, హారతుల అనంతరం స్వామి,అమ్మవార్లను బ్రహ్మగుడి, నాలుగు మాడవీధుల గుండా ఊరేగింపు నిర్వహించన్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

10న వాలీబాల్ పోటీలు

బైరెడ్డిపల్లె: బాట గంగమ్మ జాతర సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈనెల 10న బైరెడ్డిపల్లెలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్న ట్టు నిర్వాహకులు తెలిపారు. విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్టు చెప్పారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామన్నారు. ఫుట్‌బాల్ క్రీడాకారులైన శేఖర్‌గౌడు, లియాఖత్ ఆలీ, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్, హనుమంతురెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న పోటీల్లో ఉమ్మడి జిల్లాల వారే కాకుండా ఏ ప్రాంతం వారైనా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల వారు 97032 26723, 9908585899, 9652929909 నంబర్లకు సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

మామిడిలో సస్య రక్షణ ఎంతో ముఖ్యం

నారాయణవనం: మామిడి పూత దశలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యావన శాఖ అధికారి వెంకట సౌజన్య సూచించారు. గురువారం నైనారుకండ్రిగ, అరణ్యకండ్రిగ పంచాయతీల్లో ఉన్న మామిడి తోటలను వ్యవసాయ సహాయకులు, రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఆశించిన స్థాయిలో మామిడి పూత లేకపోవడం, రాలడం, తేనె మంచు పురుగు ఆశించడాన్ని గుర్తించారు. డిసెంబర్‌లో అధిక వర్షం కురవడంతో పూత ఆలస్యంగా రావడం, యాజమాన్య పద్ధతులను పాటించకపోవడంతో పూత రాలిపోతోందని రైతులకు ఆమె వివరించారు. పూత దశలో చెట్లకు కావల్సిన బెట్ట పరిస్థితి లేక పోవడంతో ఈ ఏడాది ఆలస్యంగా వస్తున్నట్లు తెలిపారు. పూత మొగ్గ రాలకుండా లీటరు నీటిలో 13-0-45 మందు 5 గ్రాములు, ఫార్ములా-4ను 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తేనె మంచు పురుగుతో పిందెలు రాలకుండా ఉండేందుకు లీటరు నీటిలో 1.6 గ్రాముల మోనో క్రోటోపాస్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. పచ్చ పూత దశలో 25 శాతం బుప్రోఫెజిల్ 1.5 మిల్లీ, హెక్సాకోనోజోల్ 2 మిల్లీ లీటర్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నల్లపూత దశలో 20 శాతం బుప్రోఫెజిల్, ఎసిఫెల్‌ను గ్రాము చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి దిగుబడిని సాధించవచ్చునని తెలిపారు. చెట్ల మొదళ్లకు క్రమం తప్పకుండా తడులు ఇస్తూ, వ్యవసాయ సహాయకుల సూచనలు పాటించాలని వివరించారు. అరణ్యంకండ్రిగ సచివాలయ వ్యవసాయ సహాయకుడు మోహన్‌రాజు పాల్గొన్నారు.

మామిడిలో తెగులు నివారణకు చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, కుక్కంబాకం గ్రామాల్లోని మామిడి, మిరప పంటలను గురువారం మండల ఉద్యాన శాఖాధికారి యామిని పరిశీలించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న మంచుతో తేనె పురుగు ఆశించడంతో మామిడి చెట్లలో పూత రావడం లేదన్నా రు. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు, లేదా మంకోజెబ్ 2 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తామర పురుగు నివారణకు ఫ్రూట్ కవర్స్‌ను వినియోగించాలని తెలిపారు. సందేహాలపై 7995086941కు ఫోన్ చేస్తే సలహాలు ఇస్తామని పేర్కొన్నారు.

తేనే మంచుపురుగుతో జాగ్రత్త

సత్యవేడు: వేడి వాతావరణ పరిస్థితులు వల్ల మామిడి తోటలను తేనెమంచు పురుగులు ఆశించి పంటకు నష్టం కలిగిస్తాయని ఉద్యానశాఖ అధికారి రాధరాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ తేనె మంచు పురుగులు తల్లి,పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత కాండలు, పిందెల రసం పీల్చేస్తాయని పేర్కొన్నారు. నివారణ చర్యలను వివరించారు.